ఒపిఎస్ కోసం సమైక్య ఉద్యమం

- విశాల ఐక్యవేదికలో భాగస్వామ్యం కండి
- పిఎఫ్ఆర్‌డిఎ రద్దు కోసం కొట్లాడుదాం కలిసిరండి
- ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపు
- ఒపిఎస్ పునరుద్ధరణ అంశం రాబోయే ఎన్నికల్లో ప్రధాన అజెండాగా మారాలి
- ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా
- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జెఎఫ్ఆర్‌ఒపిఎస్ ఆవిర్భావం

జెఎఫ్ఆర్‌ఒపిఎస్ ఆవిర్భావ సందర్భంగా అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ (ఒపిఎస్) కోసం జాతీయ స్థాయిలో సమైక్య ఉద్యమం చేయాల్సిన అవసరముందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి స్పష్టం చేశారు. ఒపిఎస్ కోసం తెలంగాణలో విశాల ఐక్యవేదిక ఏర్పడటం మంచి పరిణామమన్నారు. ఆ వేదికలో చేరని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలన్నీ కలిసి రావాలని కోరారు. ఐక్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కొట్లాడితే కచ్చితంగా దిగొస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రైల్వేలు, బ్యాంకింగ్, బీమా, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, లెక్చరర్ల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జాయింట్ ఫోరం ఫర్ రెస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (జెఎఫ్ఆర్‌ఒపిఎస్) ఏర్పడింది. ఇందుకోసం నిర్వహించిన రాష్ట్ర సదస్సుకు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ప్రధాన కార్యదర్శి అజీజ్ అహ్మద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ..నూతన పెన్షన్ విధానాన్ని (ఎన్పీఎస్) కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏకపక్షంగా అమల్లోకి తీసుకొచ్చిందని విమర్శించారు. అందులోకి కోటి 75 లక్షల మంది సభ్యులుగా బలవంతంగా నెట్టబడ్డారన్నారు. 1991 తర్వాత వచ్చిన ఆర్థిక సంస్కరణల ప్రభావం పెన్షన్ స్కీమ్‌పై కొట్టొచ్చినట్టు ఉందన్నారు. అంతకుముందు పరోక్షంగా దాడి జరిగిందనీ, 2004 తర్వాత అది ప్రత్యక్షరూపం దాల్చిందని వివరించారు. భవిష్యత్‌లో ప్రమాదం ముంచుకు రాబోతున్నదని అప్పట్లోనే తాము హెచ్చరించామన్నారు. ఎన్‌పిఎస్ ప్రాణం పిఎఫ్ఆర్‌డిఎలో ఉందని, దాని రద్దు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఒపిఎస్ కోసం ఉద్యమాలు విడివిడిగా జరుగుతున్నాయని, వాటన్నింటినీ ఐక్యంగా ముందుకు తీసుకోవాల్సిన బాధ్యత ఈ వేదిక తీసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలన్నీ విశాల ఐక్య వేదికలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని పాలకులు ఒపిఎస్ పునరుద్ధరించడం సాధ్యం కాదనీ, దానివల్ల ప్రభుత్వ ఖజానాకు పెద్ద ఎత్తున భారం పడి ఆర్థిక వ్యవస్థకు నష్టం జరుగుతుందని చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని నర్సిరెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా మాట్లాడుతూ.. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పంజాబ్, ఢిల్లీ, తదితర రాష్ట్రాల్లో ఒపిఎస్ అమలవుతున్నదన్నారు. మిగతా రాష్ట్రాల్లోనూ అమలు కోసం పోరాటం తీవ్రం చేయాలన్నారు. పాత పెన్షన్ విధానం కార్మిక, ఉద్యోగ వర్గాలకే కాక దేశానికీ చాలా ఉపయోగకరమన్నారు. ఈ అంశం రాబోయే ఎన్నికలలో ప్రధాన ఎజెండాగా మారాలని, ప్రజల మద్దతు కూడగట్టాలని పిలుపునిచ్చారు.

అన్ని సంఘాలు సంయుక్తంగా పోరాడితేనే అది సాధ్యమవుతుందని నొక్కిచెప్పారు. 14 కోట్ల మందికి సామాజిక భద్రత కల్పించే సరైన వ్యవస్థ లేదని, జాతీయ సామాజిక భద్రత పేర వృద్ధులకు ఆర్థిక సహాయం అందించేందుకు ఉద్దేశించిన పథకం ద్వారా ఇచ్చే సహకారం చాలా మందికి కేవలం రూ.1000లోపే అందుతుండటం దారుణమన్నారు. కూరగాయలు, దినసరి సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ఇది అత్యంత కనిష్టమన్నారు. ఒక్కరోజులో 27 మీడియా ఛానళ్లను కొనుగోలు చేయగలిగే శక్తి కలిగి, 27 అంతస్తుల భారీ భవంతిలో సుఖాలు అనుభవిస్తున్న అంబానీ లాంటి శతకోటీశ్వరుల సంపదలో కేవలం ఒక్క శాతం పన్నులు ప్రభుత్వానికి సమర్పించినట్లయితే.. దేశంలోని ఉద్యోగ కార్మికులందరికీ పెన్షన్ సౌకర్యం సునాయాసంగా అందించవచ్చని తెలిపారు. అయినా నేటి కేంద్ర పాలకులు ఇలాంటి చర్యలకు పూనుకోరని శ్రీకాంత్ మిశ్రా ఎద్దేవా చేశారు.

శంకర్‌రావు మాట్లాడుతూ..ఎన్‌పిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించే పార్టీలకే తమ ఓట్లు అని స్పష్టం చేశారు. ఉద్యోగి రిటైర్డయ్యే సమయంలో పొందే వేతనంలో 50 శాతాన్ని పెన్షన్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెన్షన్‌దారుడు చనిపోతే పూర్తిస్థాయిలో భార్య, ఇతర కుటుంబ సభ్యులకు అందేలా చూడాలన్నారు. ఎన్‌పిఎస్‌పై కేంద్రం వేసిన కమిటీపై భ్రమలు అవసరం లేదన్నారు. కమిటీలపై ఆశలు పెట్టుకోకుండా ఒపిఎస్ కోసం ఉద్యమం చేయడమే సరైందన్నారు.

ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి ఉదయ్‌భాస్కర్, టిపిటిఎఫ్ అధ్యక్షుడు వై అశోక్ కుమార్, డిటిఎఫ్ అధ్యక్షుడు ఎం సోమయ్య, డిఆర్‌డిఒ హైదరాబాద్ ల్యాబ్స్ సిఒసి(ఎఐడిఈఎఫ్ అనుబంధం) చైర్మెన్ శ్రీకాంత్ గౌడ్, టిఆర్‌టిఎఫ్ అధ్యక్షుడు కె అశోక్ కుమార్, జి తిరుపతి (ఎల్‌ఐసి), శ్రావణ్ కుమార్ (పోస్టల్), సతీష్ బాబు (రూరల్ బ్యాంక్స్), ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధ్ ప్రమాణం

- హాజరైన గవర్నర్, సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధ్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనతో గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ ప్రమాణం చేయించారు. వేదికపై వారిద్దరితో పాటు సిఎం కెసిఆర్ కూర్చున్నారు. అరాధ్ ఆంగ్లంలో ప్రమాణం చేశారు. రాజ్యాంగానికి అనుగుణంగా చట్టాలను అమలు చేస్తూ విధుల్ని నిర్వహిస్తూ తీర్పులు వెలువరుస్తానని తెలిపారు. ప్రమాణ స్వీకారం తర్వాత గవర్నర్, సిఎంలు చీఫ్ జస్టిస్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. రాష్ట్రపతి జారీ చేసిన నియామక వారెంట్‌ను హైకోర్టు రిజిస్ట్రార్ చదివి వినిపించారు. వారెంట్ కాపీని జస్టిస్ అలోక్‌కి గవర్నర్ అందజేశారు. చీఫ్ సెక్రటరీ శాంతికుమారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటి వరకు సీజేగా చేసిన జస్టిస్ భూయాన్‌కు పదోన్నతి లభించడంతో ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లిన సంగతి తెలిసిందే. దీంతో కొత్త సిజెగా మధ్యప్రదేశ్‌కు చెందిన జస్టిస్ అలోక్‌ను నియమించాలని సుప్రీంకోర్టు కేంద్రానికి రికమండ్ చేసింది. దీన్ని కేంద్రం ఆమోదించడంతో ఈ నెల 19న రాష్ట్రపతి నియామక వారెంట్‌పై రాజముద్ర వేశారు.

భుయాన్ సుప్రీంకోర్టుకు వెళ్లిన నాటి నుంచి యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా అభినంద్ కుమార్ షావిలి పని చేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ అలోక్ అరాధ్ 2009 డిసెంబర్‌లో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అక్కడి నుంచి జమ్మూకాశ్మీర్ హైకోర్టు బదిలీ అయ్యారు. ఆ తర్వాత 2018 నుంచి కర్నాటక హైకోర్టు న్యాయమూర్తిగా పని చేస్తున్నారు. ప్రమోషన్‌పై ఇప్పుడు రాష్ట్ర హైకోర్టుకు వచ్చారు. జస్టిస్ అలోక్ 1964 ఏప్రిల్ 14న రాయ్‌పూర్‌లో జన్మించారు. బీఎస్సీ, ఎల్‌ఎల్‌బీ చేశాక 1988లో లాయర్‌గా ఎన్‌రోల్ అయ్యారు. 2007లో ఆయనకు సీనియర్ అడ్వొకేట్ హోదా లభించింది. కార్యక్రమానికి జడ్జీలు, లా ఆఫీసర్లు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

కెప్టెన్ లక్ష్మీ సెహగల్ స్ఫూర్తితో హక్కుల కోసం ఉద్యమాలు

- ఐద్వా ఉపాధ్యక్షులు టి జ్యోతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెప్టెన్ లక్ష్మీ సెహగల్ పోరాట స్ఫూర్తితో మహిళా హక్కుల కోసం ఉద్యమాలు నిర్వహించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షులు టి జ్యోతి పిలుపునిచ్చారు. లక్ష్మీసెహగల్ 11వ వర్ధంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని ఐద్వా రాష్ట కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్యమైన పాత్ర పోషించడమే కాక, యుద్ధంలో గాయపడిన సైనికులకు డాక్టర్‌గా వైద్య సేవలు అందించిన వీరనారి సెహగల్ ఆమెని తెలిపారు. స్వాతంత్ర్యం పోరాటంలో సుభాష్ చంద్రబోస్ నడిపిన సైన్యంలో చేరి 50 మందితో మహిళా రెంజిమెంట్ తయారుచేసి దానికి కెప్టెన్‌గా బాధ్యత వహించారని చెప్పారు. పోరాడి సాధించుకున్న స్వతంత్ర భారతంలో నేడు మహిళలకు భద్రత లేకుండా పోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు నెల్లుగా మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమానికి బిజెపినిఏ బాధ్యత వహించాలని చెప్పారు. స్త్రీలపై జరుగుతున్న అమానుష ఘటనలను నిలవరించటంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణ జ్యోతి మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం సెహగల్ తాన తుది శ్వాస వరకు పేదలకు ఉచితంగా వైద్యం అందించిన గొప్ప మహనీయురాలని చెప్పారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు బి. కవిత, కె శాంతమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

జనం మెచ్చిన నాయకుడు కెటిఆర్

- జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కోలేటి దామోదర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ జనం మెచ్చిన నాయకుడని, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్ పేర్కొన్నారు. టిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులుగా రాణించాలనీ, యువతకు ఐకాన్‌గా, పార్టీ నాయకులకు మార్గదర్శిగా నిలవాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

మైనార్టీలకు రూ.లక్ష ఆర్థిక సాయం

- రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని బిసిలకు అందిస్తున్న తరహాలోనే మైనార్టీలకూ రూ. లక్ష ఆర్థిక సాయాన్ని పూర్తి సబ్సిడీతో ప్రభుత్వం అందించనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఇందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. తద్వారా మైనార్టీలకు ఆర్థిక సాయానికి సంబంధించి సిఎం మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా పేదరికాన్ని పారద్రోలాలనే దార్శనికతతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఇప్పటికే అన్ని వర్గాల పేదలకు ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని తెలిపారు. వారి అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం

కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. విద్య, ఉపాధి సహా పలు రంగాల్లో ఇప్పటికే పలు పథకాలను అమలు చేస్తూ మైనార్టీల్లోని పేదరికాన్ని, వెనుకబాటును తొలగించేందుకు కృషి చేస్తున్నాయని వెల్లడించారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమర్థవంతమైన కార్యాచరణ సత్ఫలితాలను అందిస్తున్నదని వివరించారు. భిన్న సంస్కృతులను, మత, ఆచార సాంప్రదాయాలను సమానంగా ఆదరిస్తూ రాష్ట్రంలో గంగా జమునా తహజీబ్‌ను కాపాడే ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందని సిఎం స్పష్టం చేశారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ సర్వేను అడ్డుకున్న రైతులు

- అలైన్‌మెంట్ మార్చాల్సిందే..
- సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగపూర్ నుంచి అమరావతి వరకు నూతనంగా నిర్మించే గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి అలైన్మెంట్ మార్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని కొదుమూరు, వందనం గ్రామాలకు ఆదివారం తెల్లవారుజాము నుంచే భారీగా పోలీసులు, రెవెన్యూ అధికారులు చేరుకొని భూ సర్వే చేపట్టేందుకు ప్రయత్నించగా వారిని రైతులు అడ్డుకున్నారు. దాంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు మాదినేని రమేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు అక్కడికి చేరుకొని రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రహదారిలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వకుండానే సర్వే ఎలా చేపడతారంటూ ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు పరిహారం అందజేసే విషయంలో లిఖితపూర్వకంగా స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాతే సర్వే ప్రారంభించాలని సూచించారు. నూతన కలెక్టరేట్ ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చిన పరిహారాన్ని గ్రీన్ ఫీల్డ్ రైతులకూ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా, రెవెన్యూ అధికారులు సర్వే చేసి తీరుతామని చెప్పడంతో రైతులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. సర్వే ప్రాంతంలో రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు రోడ్డుపై బైటాయించి ఆందోళన చేపట్టడంతో అధికారులు ఎట్టకేలకు సర్వే నిలిపివేశారు. కార్యక్రమంలో సిపిఎం చింతకాని, రఘునాథపాలెం మండలాల కార్యదర్శులు మడిపల్లి గోపాలరావు, నవీన్‌రెడ్డి, నాయకులు వత్సవాయి జానకి రాములు, రాచబంటి రాము, రైతు సంఘం నాయకులు కొల్లి సీతయ్య, పెంటాల అప్పారావు, వెంకటేశ్వర్లు, బొగ్గారపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'భీముని పాదం' వద్ద సందర్శకుల సందడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో భీమునిపాదం జలపాతం పరవళ్తు తొక్కుతోంది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం గ్రామపంచాయతీ కొమ్ములవంచ అటవీ ప్రాంతంలో ఉన్న భీముని పాదం జలపాతం వద్ద ఆదివారం సందర్శకుల సందడితో కిక్కిరిసింది. జిల్లాతో పాటు సుదూర ప్రాంతాల నుంచి సందర్శకులు భారీగా తరలివచ్చారు. కాగా జలపాతం వద్ద ఎలాంటి ప్రమాదాలు సంఘటనలు జరగకుండా అటవీశాఖ ఆధ్వర్యంలో సిబ్బందిని ఏర్పాటు చేశారు.

వికలాంగులకు దేశంలోనే అధిక పింఛను

- కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ఎక్కడా లేని విధంగా వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అధిక పింఛన్‌ను ఇస్తున్నదని వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగులకు సిఎం కెసిఆర్ కొండంత అండగా నిలిచారని కొనియాడారు. ఒకే సారి వెయ్యి రూపాయలు పెంచుతూ జిఒ జారీ చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో బాణా సంచా కాల్చి సంబురాలు చేసుకున్నారని తెలిపారు. పెరుగుతున్న జీవన ప్రమాణాలకు అనుగుణంగా పింఛన్‌ను పెంచారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వికంగుల నాయకులు మున్నా, గుత్తికొండ కిరణ్, నల్లగొండ శ్రీనివాస్ సుమన్, రాజ్యలక్ష్మి, కొమురెల్లి, వేణు,నాగరాజు, మనీ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ఎరువు బరువు..?

- ముడిసరుకు ధర తగ్గినా.. తగ్గించని కేంద్రం
- సబ్సిడీల్లో భారీగా కోత
- ధరలు మాత్రం యథాతథం
- ఆవేదన చెందుతున్న రైతాంగం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రం రైతులపై లేనిప్రేమను ఒలకబోస్తూ తనదైన రీతిలో దగా చేస్తోంది. ఎరువుల ధరలే దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పొచ్చు. అంతర్జాతీయంగా ఎరువుల ముడిసరుకు ధరలు తగ్గినా రైతులకు ఇస్తున్న సబ్సిడీని తగ్గించుకుంది కానీ రేట్లు ఏమాత్రం తగ్గించలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రైతులు పంట చేలలో కలుపు తొలగించి.. వివిధ రకాల ఎరువులు వేసేందుకు సిద్ధమవుతున్నారు. దుకాణాల వద్దకు వెళ్లి ఫెర్టిలైజర్ రేట్లు చూసి అవాక్కవుతున్నారు. ఈ వానాకాలానికి ఎరువులపై రూ.1.08 లక్షల కోట్ల సబ్సిడీ ఇస్తున్నట్టు కేంద్రం బడ్జెట్‌లో ప్రకటించింది. 2022-23లో ఎరువులపై సబ్సిడీ రూ.2.54 లక్షల కోట్లు ఉండగా.. ఈ ఆర్థిక సంవత్సరం 22.25% కోత పెట్టి రూ.1.75 లక్షల కోట్లకు తగ్గించింది. సేంద్రీయ సాగును ప్రోత్సహించే పేరుతో 'పీఎం ప్రణామ్' పథకాన్ని తీసుకొచ్చి సబ్సిడీకి ఎగనామం పెట్టేందుకు ప్రయత్నిస్తోందని రైతుసంఘాలు ఆరోపిస్తున్నాయి.

యూరియా, డిఏపి సబ్సిడీల్లో కోత

రైతులు ఎక్కువగా వినియోగించే యూరియా, డిఏపి వంటి ఎరువులకు గతంలో ఇచ్చిన సబ్సిడీతో పోలిస్తే ఈసారి కేటాయింపులు గణనీయంగా తగ్గాయి. యూరియాకు రూ.78వేల కోట్లు, డిఏపికి రూ.38వేల కోట్లతో సరిపెడుతోంది. అంతర్జాతీయంగా ఎరువుల ధరలు తగ్గడంతో సబ్సిడీ మొత్తాన్ని తగ్గించినట్టు కేంద్రం చెప్పుకొస్తోంది. కానీ అంతర్జాతీయ ధరల క్షీణతకు అనుగుణంగా దేశీయంగా ఎరువుల ధరలను మాత్రం సవరించకపోవడం గమనార్హం. గ్లోబల్ మార్కెట్‌లో తక్కువ ధరకు ఎరువులు లభిస్తున్నా.. అన్నదాతకు ఆ ప్రయోజనం దక్కకుండా మోడీ సర్కారు మోకాలడ్డుతోంది.

గ్లోబల్ మార్కెట్ ధరలు ఇండియన్ మార్కెట్‌కు వర్తించవా..?

అంతర్జాతీయ మార్కెట్లో ఎరువుల ధరలు పెరిగితే ఆ పేరుతో దేశీయంగా ధరలు పెంచే కేంద్ర ప్రభుత్వం తగ్గినప్పుడు మాత్రం ఆ మేరకు సవరించట్లేదని స్పష్టమవుతోంది. అమ్మోనియా, ఫాస్పరిక్ యాసిడ్‌తోపాటు ఎంఒపి, డిఏపి, 10:26:26, 28:28:0, కాంప్లెక్స్ ఎరువులు, పొటాష్ ధరలు గ్లోబల్ మార్కెట్లో జనవరి-ఫిబ్రవరి నుంచి క్రమేణా క్షీణిస్తున్నాయి. ఫిబ్రవరిలో 12 శాతం ఉన్న తగ్గుదల ఏప్రిల్ నాటికి 40శాతానికి చేరింది. ఈ ధరలను ఆధారం చేసుకుని సబ్సిడీ మొత్తాన్ని కేంద్రం తగ్గించింది. కానీ ఎరువుత ధరలను మాత్రం సవరించలేదు. దీనివల్ల ఇటు రైతులు, కంపెనీలకు ప్రయోజనం దక్కకపోవడంతో దేశీయంగా ఎరువుల ధరల్లో వ్యత్యాసం లేదని ఎరువుల హోల్‌సేల్ అండ్ రిటైల్ వర్తకుల అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు పుల్లఖండం నాగేందర్‌రావు తెలిపారు.

ముడిసరుకు ధర క్షీణత

అంతర్జాతీయంగా ఎరువుల ముడిసరుకు ధరలు క్షీణిస్తున్నాయి. జనవరిలో అమ్మోనియా మెట్రిక్ టన్ను ధర డాలర్లలో 830 ఉంటే ఏప్రిల్ నాటికి 250కి పడిపోయింది. ఫాస్పరిక్ యాసిడ్ రేటు 1150 డాలర్ల నుంచి వెయ్యికి తగ్గింది. యూరియా 580 నుంచి 290 డాలర్లకు పడిపోయింది. తదనుగుణంగా ఎరువుల ధరలు తగ్గాలి కానీ పెంచిన రేట్లు అలానే ఉంచడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్లోబల్ మార్కెట్లో ఎరువుల ముడిసరుకు రేట్లు తగ్గినా ధరల్లో ఎలాంటి మార్పుల్లేవు. పొటాష్ ముడిసరుకు రేటు తగ్గినా.. సబ్సిడీ పెంచలేదు. 45వేల నుంచి 19వేలకు యూరియా సబ్సిడీ తగ్గినా ధరల్లో మాత్రం వ్యత్యాసం లేదు. డిఏపి రూ.2,650 సబ్సిడీ తగ్గినా బస్తా ధర మాత్రం రూ.1450గానే ఉంది. గతేడాది నానో యూరియాను వెలుగులోకి తెచ్చిన కేంద్రం ఈ సంవత్సరం నానో డిఏపిని ప్రవేశపెట్టి సబ్సిడీ భారం నుంచి ఉపశమనం పొందుతోంది. ఈ నానో డిఏపి లీటర్ బాటిల్ ధర రూ.600గా నిర్దేశించింది. కేంద్రానికి సబ్సిడీ సొమ్ము భారీగా మిగులుతోంది. నానో యూరియా, డిఏపిలను పురుగుమందుల తరహాలో ఆకులపై పిచికారీ చేస్తే సరిపోతుంది. 'పీఎం ప్రణామ్' పథకాన్ని ప్రోత్సహించడానికి సబ్సిడీని ఏటికేడు క్రమంగా ఎత్తివేస్తోంది.

వ్యత్యాసం స్వల్పమే..!

ద్రవ రూపంలో ఉండే నానో యూరియా, నానో డిఏపి అందుబాటులోకి వచ్చినా ధరల్లో పెద్దగా వ్యత్యాసం లేదు. 50 కేజీల బస్తాను అర లీటర్ నానో ఎరువుగా తయారు చేశారు. యూరియా బస్తా రూ.268 ఉండగా నానో యూరియా బాటిల్ రూ.240కి లభిస్తుంది. దీనివల్ల బస్తాకు సుమారు రూ.3వేలకు పైగా ఇచ్చే యూరియా సబ్సిడీని కేంద్రం తప్పించుకుంది. నానో ఎరువులతో అధిక ప్రయోజనాలున్నాయని ప్రభుత్వం చెబుతున్నా.. రైతులు మాత్రం వీటిపై ఆసక్తి చూపడం లేదు.

సబ్సిడీ తప్పించుకునే యత్నం

ఘనంగా 'వన్ నేషన్.. వన్ ఫర్టిలైజర్'ను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం 'భారత్ బ్రాండ్' అనే పేరుతో కంపెనీతో నిమిత్తం లేకుండా ఎరువును తీసుకొచ్చింది. మ్యాన్‌ఫ్యాక్చర్ పేరుతో కంపెనీ పేరు కొద్దిపాటి లెటర్స్‌లో ఉంటుంది తప్ప గతంలో లాగా బోల్డ్ లెటర్లు కనిపించవు. ఇవన్నీ ఆచరణలో బాగు అనిపించినా రకరకాల ఆంక్షల పేరుతో ఎరువుల సబ్సిడీ భారం నుంచి తప్పించుకునేందుకు కేంద్రం ఎన్నో ప్రయత్నాలు చేస్తోంది.

పుల్లఖండం నాగేందర్‌రావు, ఎరువులు, విత్తన డీలర్ల అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు

నేడు తెలంగాణ ట్రై క్రీడా వేడుక

- కెటిఆర్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాట్లను పర్యవేక్షించిన శాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర మున్సిపల్, ఐటి పారిశ్రామిక శాఖ మంత్రి కె తారకరామారావు పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం నిర్వహించబోయే తెలంగాణ ట్రై క్రీడావేడుక-2023కు ఏర్పాట్లు పూర్తయ్యాయని శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ తెలిపారు. ఆదివారం దానికి సంబంధించిన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్, తెలంగాణ రోరల్ స్కేటింగ్ అసోసియేషన్, తెలంగాణ ఆమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో సైక్లింగ్, రోరల్ స్కేటింగ్ మరియు రెజ్లింగ్ (మహిళ) పోటీల ప్రారంభోత్సవానికి హోంమంత్రి మహమూద్ అలీ, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ కె లక్ష్మి తదితరులు పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. మనిషికి ఆరోగ్యాన్ని అందజేసే, అతి సామాన్యులకు కూడా అందుబాటులో ఉండే ఏకైక క్రీడాంశం సైక్లింగ్ అనీ, ఆ క్రీడకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తోందని తెలిపారు. మానవ సమగ్రాభివృద్ధి క్రీడలతో సాధ్యమనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి, దత్తాత్రేయ మోసపాటి, డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి, అర్జున అవార్డు గ్రహీత అనూప్ కుమార్ యామ, చైర్మెన్ ఒఎస్‌డి డాక్టర్ కె నర్సయ్య, నిర్మల్ సింగ్, జితేందర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు

మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలి

- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మన ఇంటి పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదివారం దోమల నివారణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కోకాపేట్‌లోని తన నివాసంలో దోమల నివారణ కోసం ఇంటి పరిసరాలలో నిల్వ ఉండే నీరును స్వయంగా తొలగించి చెత్తను మంత్రి హరీష్ రావు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజం, కుటుంబం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆదివారం ఉదయం 10 గంటలకు 10 నిమిషాలు కేటాయించి కుటుంబ సమేతంగా మన ఇంటి పరిసరాలను, నిల్వ ఉండే నీటిని శుభ్రం చేసుకోవాలని కోరారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని అప్రమత్తం చేశారు.

మాన్‌సూన్ రెగట్టాలో ధరణి-మల్లేష్, దీక్షితకు స్వర్ణాలు

- తెలంగాణ సెయిలర్లకు 16 పథకాలు

ప్రజాశక్తి - హైదరాబాద్

నగరంలోని హుస్సేన్‌సాగర్‌లో నిర్వహించిన మాన్‌సూన్ రెగట్టా జాతీయ ర్యాంకింగ్ సెయిలింగ్ చాంపియన్‌షిప్ చివరి రేసుల్లో అద్భుతంగా పోరాడిన తెలంగాణకు చెందిన ఇద్దరు అమ్మాయిలు ధరణి లావేటి, దీక్షిత కొమరవెల్లి బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. అండర్ 19 ఇంటర్నేషనల్ క్లాస్ మిక్స్‌డ్ విభాగంలో ధరణి లావేటి- మల్లేష్ వడ్ల జంట ఆదివారం జరిగిన చివరి రేసులో విజయం సాధించి స్వర్ణం సాధించింది. అండర్19 ఇంటర్నేషనల్ 420 క్లాస్ మిక్స్‌డ్ విభాగంలో జాతీయ ఛాంపియన్లుగా నిలిచింది. ఇక, అండర్-15 ఆప్టిమిస్ట్ బాలికల విభాగంలో దీక్షిత కొమరవెల్లికి గట్టి పోటీ ఎదురైనప్పటికీ చివరి రేసులో 5వ స్థానం సాధించిన ఆమె సమీప ప్రత్యర్థిపై ఒక్క పాయింట్ తేడాతో గెలిచింది. దాంతో సికింద్రాబాద్ క్లబ్ రెగట్టా తర్వాత ఈ జాతీయ ర్యాంకింగ్ ఈవెంట్‌లో మరో స్వర్ణం సాధించింది. బాలుర విభాగంలో శనివారమే స్వర్ణం ఖాయం చేసుకున్న మధ్యప్రదేశ్‌కు చెందిన ఏకలవ్య బాతం 12వ రేసులో మరో స్పష్టమైన విజయంతో తన విజయాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు. ఎన్‌బిఎస్‌సి గోవాకు చెందిన శరణ్య జాదవ్, అజయ్ గజ్జి వరుసగా రజతం, కాంస్యం సాధించారు. పోటీల తర్వాత మాట్లాడిన దీక్షిత ముంబై జరగబోయే తదుపరి నేషనల్స్‌లో గెలవాలని ప్రణాళిక రచిస్తున్నానని, అందుకోసం వారంలో ప్రాక్టీస్ ప్రారంభిస్తానని చెప్పింది. దీక్షిత, ధరణి ఈ స్థాయి ప్రదర్శనను కొనసాగిస్తే జాతీయ జట్టులో ఇద్దరికీ స్థానం ఖాయమే అనొచ్చు. ఇక ఈ టోర్నీలో అన్ని విభాగాల్లో కలిపి తెలంగాణ సెయిలర్లు ఏడు స్వర్ణాలు, ఆరు రజతాలు, మూడు కాంస్యాలు గెలిచారు. దీనిపై తెలంగాణ సెయిలింగ్ సంఘం అధ్యక్షుడు డాడీ భోటే సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ సెయిలర్లు చాలా నెలల పాటు కష్టపడి ఈ సీజన్‌లో అద్భుతంగా రాణించారన్నారు. అంతకుముందు సర్జన్ వైస్ అడ్మిరల్, వీఎస్‌ఎమ్ ఆర్తి సారిన్ చివరి రేసును జెండా ఊపి ప్రారంభించారు. యువ నావికులతో విలువైన సమయాన్ని వెచ్చించారు. కఠోర శ్రమ, నిబద్ధత, పట్టుదల మాత్రమే పతకాలు గెలుచుకునే ప్రదర్శనలకు దారితీస్తాయంటూ ఆమె వారిని ప్రోత్సహించారు. సంజీవయ్య పార్క్, నెక్లెస్ రోడ్‌లోని యాచ్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రాంగణంలో బహుమతి ప్రదానోత్సవానికి ఆమెతోపాటు ఎవిఎస్‌ఎమ్, విఎస్‌ఎమ్ పర్సనల్ ఇండియన్ నేవీ చీఫ్ వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ గౌరవ అతిథిగా హాజరయ్యారు.

25 ఏళ్లుగా నాణ్యమైన గృహాల నిర్మాణం

- ఎంకె బిల్డర్స్ అండ్ డెవలపర్స్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

గడిచిన 25 ఏళ్లుగా నాణ్యమైన గృహ నిర్మాణాలను చేపడుతున్నామని ఎంకె బిల్డర్స్ అండ్ డెవలపర్స్ తెలిపింది. 40కి పైగా ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసి, ఐదు వేల కంటే ఎక్కువ కుటుంబాలకు సంతోషాలను కల్పించినట్లు పేర్కొంది. నాణ్యమైన, విలాసవంతమైన గృహాలను అందించడంలో తమ నిబద్ధతతో పరిశ్రమలో అత్యంత విశ్వసనీయ సంస్థగా ఉన్నామని పేర్కొంది. ప్రస్తుతం వైజాగ్‌లో ఎంకె వన్ ప్రాజెక్ట్‌ను చేపడుతున్నట్లు తెలిపింది. విలాసవంతమైన జీవనశైలి ప్రాజెక్ట్‌లలో ఒకటిగా మిగిలి పోనుందని తెలిపింది. ఈ ప్రాజెక్ట్ 151 ప్రీమియం సౌకర్యాలను కలిగి ఉందని పేర్కొంది. ఎంవివి అండ్ ఎంకె పార్క్ ప్రాజెక్టు ఆధునిక కుటుంబ అవసరాలను తీర్చడానికి రూపొందించబడిందని తెలిపింది. మొత్తం ఆరు టవర్స్‌లో 2000 ప్లాట్స్‌ను నిర్మిస్తున్నామని పేర్కొంది.

కార్పొరేట్ల కోసమే మణిపూర్‌లో మానవ హననం

- గడ్డం సదానందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్పొరేట్ల కోసమే మణిపూర్‌లో మానవ హననం జరుగుతున్నదని సిపిఐ (ఎంఎల్) ఆర్ ఐ, సిఐసి సభ్యులు గడ్డం సదానందం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అటవీ సంపదనంతా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుకీలను అడవి దూరం చేసే కుట్రలో భాగమే ఈ దారుణాలని తెలిపారు. అనేక మంది మహిళలపై సామూహిక లైంగిక దాడులు జరుగుతున్నా..కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే మోడీ విధానాలున్నాయని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

ఐఎంటిలో గ్రాండ్ కాన్వోకేషన్ నిర్వహణ

హైదరాబాద్ : ప్రీమియర్ బిజినెస్ స్కూల్ ఐఎంటి హైదరాబాద్ తమ క్యాంపస్‌లో 2021-2023 బ్యాచ్ కాన్వోకేషన్ (స్నాతకోత్సవం) వేడుకను నిర్వహించినట్లు ఆ సంస్థ తెలిపింది. దీంతో మరో విద్యా సంవత్సరం విజయవంతంగా ముగిసినట్లు పేర్కొంది. ఐఎంటి హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ కె శ్రీహర్ష రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ వేడుకకు ముఖ్య అతిథిగా డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఛైర్మన్ సతీష్ రెడ్డి హాజరయ్యారని వెల్లడించింది. 2023 విద్యా సంవత్సరంలో జరిగిన ముఖ్య సంఘటనలను శ్రీహర్ష రెడ్డి తన వార్షిక నివేదికలో తెలిపారు. దాదాపు 68 కంపెనీలు తమ క్యాంపస్‌ను సందర్శించాయన్నారు.

సిట్టింగులకే సీట్లు ఇవ్వాలి : వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత లేదని చెబుతున్న సిఎం కెసిఆర్ అదే నిజమైతే.. సిట్టింగ్‌లకే సీట్లు ఇచ్చి ఎన్నికల బరిలో నిలపగలరా? అని వైఎస్ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. రాష్ట్రంలో తొమ్మిదేళ్లుగా అవినీతి తీవ్రంగా పెరిగిందని తెలిపారు. కుటుంబానికి పదవులిచ్చి, ఉద్యమ ద్రోహులను నెత్తిన పెట్టుకున్నారని విమర్శించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తే నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని గుర్తుచేశారు.

మణిపూర్ సిఎం రాజీనామా చేయాలి

- మారణహోమం జరుగుతుంటే.. కేంద్రం ఏం చేస్తోంది
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్
- రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రజాసంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో నిరసనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మణిపూర్‌లోని కాంగ్‌ఫోక్పీ జిల్లాలో కుకీ తెగకు చెందిన ఇద్దరు ఆదివాసీ మహిళలను వివస్త్రలుగా చేసి ఊరేగిస్తున్నా చూసీచూడనట్టు వ్యవహరించడమే కాక, మూడు నెలలుగా రాష్ట్రంలో మరణహోమం జరుగుతున్నా స్పందించని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మూడు నెలలుగా భయానక మారణ హోమం జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం నిరసనలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దాచ లక్ష్మి ఫంక్షన్ హాల్ నుంచి వివేకానంద చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాల్గొన్న టి సాగర్ మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలపై సాగుతున్న అఘాయిత్యాలు వెలుగులోకి వస్తున్నా.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కాని, ప్రధాని మోడీ కాని దీనిపై మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఈ ఘటనను సుమోటోగా తీసుకుంటామని సుప్రీంకోర్టు తీవ్రంగా వ్యాఖ్యానించడంతో.. ప్రధాని మొసలి కన్నీరు కారుస్తూ నేరస్తులను కఠినంగా శిక్షిస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీ మహిళగా ఉన్న రాష్ట్రపతి కూడా ఏ మాత్రం స్పందించకపోవడం బాధకరమని అన్నారు. దుండగులను కఠినంగా శిక్షించాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మహబూబ్‌నగర్ పట్టణంలో టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఉపాధ్యాయులతో ర్యాలీ నిర్వహించారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేశారు.

హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని అమృత ఎస్టేట్ నుంచి 'వై' జంక్షన్ వరకు.. సిపిఐ ఆధ్వర్యంలో గిరిజన సంఘం, మహిళా సమాఖ్య, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, దళిత హక్కుల పోరాట సమితి, విద్యార్థి ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర నాయకులు పశ్య పద్మ మాట్లాడుతూ.. ఆదివాసీ మహిళల నగ్న ప్రదర్శన, వారిపై లైంగికదాడులు, హత్యలు జరుగుతున్నా నియంత్రించలేని రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన తీసుకురావాలని డిమాండ్ చేశారు. ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ ఫాస్టర్స్ అసోసియేషన్, ట్విన్ సిటీస్ ఫాస్టర్స్ ఫెలోషిప్స్ ఆధ్వర్యంలో వందలాది మంది క్రైస్తవులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ.పాల్ మాట్లాడుతూ.. మణిపూర్‌లో జరిగిన సంఘటనలను చూసి ప్రపంచమంతా నివ్వెరపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బిజెపిని, కేంద్రంలోనూ, తెలంగాణలోనూ చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

ఖమ్మం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సెంటర్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం గ్రామంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో ఐద్వా ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఇల్లందులో సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ పేదలకు విరాళాలు సేకరించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. తిప్పర్తి మండల కేంద్రంలో సిపిఎం, ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక వాణిజ్య భవన్‌సెంటర్‌లో నిరసనర్యాలీ చేపట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం సింగన్నగూడెం చౌరస్తాలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సంస్థాన్‌నారాయణపురం మండలంలోని అల్లందేవి చెర్వు గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఆలేరు పట్టణంలో ప్రగతిశీల మహిళాసంఘం, పివైఎల్ ఆధ్వర్యంలో రైల్వేగేట్ సెంటర్‌లో ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

వీరపనేని ఆశయాలు కొనసాగించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వీరపనేని రామదాసు, వెంకటసుబ్బమ్మ దంపతుల ఆశయాల స్ఫూర్తితో పార్టీ కార్యకర్తలు ముందుకు సాగాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి అన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో తీగల ఆదిరెడ్డి అధ్యక్షతన వీరపనేని రామదాసు, వెంకటసుబ్బమ్మ 3వ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు అంబాల పోషాలు జెండా ఆవిష్కరించారు. అనంతరం మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. రామదాసు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నాటి నుంచి తుది శ్వాస వరకు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేశారని తెలిపారు. గోవిందరావుపేట మండలంలో రైతు సమస్యలతోపాటు లక్నవరం కాలువ సమస్య పరిష్కారానికి, గిట్టుబాటు ధర కోసం నిరంతరం ప్రజా ఉద్యమాలు నిర్మించారన్నారు. ఆయనతో పాటు ఆయన భార్య వెంకటసుబ్బమ్మ సైతం మహిళా ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. కానీ నేడు కొంత మంది రాజకీయ నాయకులు స్వార్థ రాజకీయాల కోసం దేశంలో మతోన్మాద మంటలు లేపుతున్నారన్నారు. మణిపూర్‌లో ఇద్దరు కుకీ మహిళపై క్రిస్టియన్ పేరుతో నగ్నంగా ఊరేగించి లైంగికదాడికి పాల్పడి వారికి దారుణంగా హత్య చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో రోజురోజుకూ పేదరికం పెరిగిపోతోందని, ఇంటి స్థలాలు కూడా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మరోపక్క కార్పొరేట్ శక్తుల ఆదాయాలు రోజురోజుకు భారీగా పెరుగుతున్నాయని, వారికి మోడీ ప్రభుత్వం రాయితీలు ఇస్తుందని తెలిపారు.

రామదాసు ఆశయసాధన కోసం వారి కుటుంబ సభ్యులు నేటికీ మండలంలో పేద పిల్లలందరికీ నోటు పుస్తకాలు అందిస్తున్నారన్నారు. రామదాసు స్ఫూర్తిగా మతోన్మాద పార్టీ బిజెపిపై భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, రత్నం రాజేందర్, జిల్లా కమిటీ సభ్యులు పొదిళ్ల చిట్టిబాబు, ఎండి దావూద్, రామదాసు కుటుంబ సభ్యులు వీరపనేని డాంగే, వీరపనేని కృశ వౌ, వీరపనేని పాణి, చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ అజ్మీరా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్‌లో లైవ్ డెర్మోటో సర్జరీ సదస్సు

- పాల్గొన్న 400 మంది డెర్మటాలజిస్టులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్ఐఎడివిఎల్, కిమ్స్ ఆసుపత్రి డెర్మటాలజీ విభాగం కలిసి సంయుక్తంగా డెర్మోటో సర్జరీ సదస్సును నిర్వహించాయి. కిమ్స్ ఆస్పత్రిలోని మూడోబ్లాకులో గల ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 8.00 నుంచి సాయంత్రం 5.00 వరకు జరిగిన ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 400 మంది డెర్మటాలజిస్టులు పాల్గొన్నారు. చర్మ వ్యాధుల, శస్త్రచికిత్సల గురించి సదస్సులో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కిమ్స్ హాస్పిటల్స్ ఎండి, చైర్మన్ డాక్టర్ బొల్లినేని భాస్కర్ రావు మాట్లాడారు. చర్మ సౌందర్య శస్త్రచికిత్సలు ఈ మధ్య కాలంలో బాగా ఆదరణ పొందాయన్నారు. సినితారల నుండి సామాన్య ప్రజల వరకు ఈ శస్త్రచికిత్స చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. అలాగే ఈ శస్త్రచికిత్సల్లో వస్తున్న అధునాతన పద్ధతులపై వైద్యులకు అవగాహన ఉండాలని సూచించారు. ఇలాంటి సదస్సులు డాక్టర్లకు ఎంతో దోహదం చేస్తాయని వ్యాఖ్యానించారు. దీని ద్వారా సమగ్ర శస్త్రచికిత్స నైపుణ్యం పెరుగుతుందన్నారు. అనంతరం కిమ్స్ హాస్పిటల్ డెర్మటాలజీ విభాగాధిపతి, సీనియర్ కన్సల్టేషన్ డాక్టర్. ఆనందర్ కుమార్ వగ్గు మాట్లాడుతూ మొదటిసారిగా ఇక్కడ లైవ్‌లో చర్మ సౌందర్యానికి సంబంధించిన శస్త్రచికిత్సను చేశామని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన ఎంతో మంది వైద్యులకు ఇది చాలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వెటిలిగో సర్జరీ, హెయిర్ ట్రాన్స్ ప్లాంట్, అకినెల్కార్ సర్జరీ, నెయిల్ సర్జరీలు లైవ్ చేశామని తెలిపారు.

సిపిఎం సీనియర్ నాయకులు నర్సింగరావు మృతి

- పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ నర్సింగరావు అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి జ్యోతి, గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్, కార్యదర్శి వర్గ సభ్యులు ఎం శ్రీనివాసరావు, నాయకులు కెవిఎస్ఎన్ రాజు, ఎన్ సోమయ్య.. హైదరాబాద్ బోయగూడలోని ఆయన నివాసానికి చేరుకుని భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జ్యోతి, ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. నర్సింగరావు కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులై చిన్నతనం నుంచి పేదల కోసం నిరంతరం పోరాటాలు చేశారని తెలిపారు. సుమారు 1955 నుంచి అప్పటి ఉమ్మడి సిపిఐ, ఆనంతరం సిపిఎం సభ్యుడిగా కొనసాగిన ఆయన.. బోయగూడలో అనేక ప్రజా సమస్యలపైన పోరాటాలు నిర్వహించారని, ఆ ప్రాంత పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. డివైఎఫ్ఐ, సిఐటియు ప్రజాసంఘాల్లో చురుకైన పాత్ర పోషించారన్నారు. బోయగూడలోని ప్రాగా టూల్స్‌లో కార్మికుల హక్కుల కోసం పోరాడారని గుర్తు చేశారు. ఇల్లు లేని పేదలకు అండగా నిలిచి ఇళ్ల నిర్మాణానికి పోరాటాలు నిర్వహించారన్నారు. బోయగూడలో బలమైనటువంటి ప్రజా పునాదిని నిర్మించి అంచలంచెలుగా ఎదుగుతూ 1965లో బోయగూడ కార్పొరేటర్ స్థానానికి పోటీ చేసి అతి తక్కువ ఓట్లతో ఓడిపోయారని తెలిపారు. పార్టీలోకి వచ్చినప్పటి నుంచి చివరి క్షణం వరకు పార్టీ ఆశయాల కోసమే కట్టుబడి పని చేసినటువంటి గొప్ప నాయకులు కామ్రేడ్ నర్సింగ్ రావు అని అన్నారు. ఆయన మృతి పార్టీకి తీవ్ర నష్టమని తెలిపారు. నివాళి అర్పించిన వారిలో.. నగర కమిటీ సభ్యులు జి నరేష్, సనత్‌నగర్ నాయకులు పి మల్లేష్, రమేష్, మహేందర్, నర్సింగ్ రావు తదితరులు ఉన్నారు.

వేడుకగా అపోలో స్నాతకోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోని ప్రముఖ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ సంస్థ అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ 2020, 2021, 2022 సంవత్సరాల్లో పట్టభద్రులైన బ్యాచ్‌లకు చెందిన మాస్టర్స్ ఇన్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థుల స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఆదివారం అపోలో హెల్త్ సిటీలోని ఆడిటోరియంలో గ్రాడ్యుయేషన్ వేడుకను నిర్వహించింది. దీనికి అపోలో హాస్పిటల్స్, టిఎస్, ఎపి రీజియన్ సిఇఒ సుబ్రహ్మణ్యం యడవల్లి ముఖ్య అతిథిగా పాల్గొని గ్రాడ్యుయేషన్ డే ఉపన్యాసం చేశారు. అపోలో హాస్పిటల్స్ చీఫ్ క్వాలిటీ ఆఫీసర్ గౌరవ్ లోరియా, ఇన్స్టిట్యూట్ పూర్వ విద్యార్థి ఎపివి రెడ్డి, కోశాధికారి రేఖ ఆర్కాట్, సిఒఒ అపర్ణా రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయ రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్‌ను అందజేశారు. 2018-20 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ జె మానస బంగారు పతకాన్ని, అదే బ్యాచ్‌కు చెందిన డాక్టర్ నజ్మునిస్సా నౌరీన్, డాక్టర్ రోహ్మా ముస్తాక్‌లకు రజత పతకాలను అందజేశారు. 2019-21 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ హీనా ఫరిస్తా, డాక్టర్ పిఎస్ స్వేచాలకు వరుసగా బంగారు, రజత పతకాలను అందజేశారు. 2020-22 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ వివిబి ఈశ్వర్య లక్ష్మి బంగారు పతకాన్ని, డాక్టర్ అడపా మల్లిక రజత పతకాన్ని అందుకున్నారు.

గోద్రెజ్ గ్రేసియాతో మిర్చి రైతులకు మేలు

హైదరాబాద్ : గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ (జిఎవిఎల్)కు చెందిన గోద్రెజ్ గ్రెసియాను మిర్చి పంటలో వాడటానికి అత్యధిక మంది రైతులు ఆసక్తి చూపుతున్నారని ఆ సంస్థ పేర్కొంది. వచ్చే సీజన్‌లోనూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 74 శాతం మంది రైతులు తమ మిర్చి పంటలోని కీటక నాశిని కోసం గ్రెసియాను వాడనున్నారని పేర్కొంది. మిరప పంట దిగుబడిని సగటున 30 శాతం-35 శాతం వరకు ప్రభావితం చేసే తెగుళ్లతో, గోద్రెజ్ గ్రెసియా పొలాల్లో ఆకు తినడం, రసం పీల్చడం వంటి లార్వా, గొంగళి పురుగులు మరియు త్రిప్స్ (తామర పురుగు) వంటి చీడపీడలపై అద్భుతమైన నియంత్రణను ప్రదర్శిస్తుందని ఆ సంస్థ పేర్కొంది. గ్రేసయను సరైన సమయంలో క్రియాశీలంగా వినియోగించటం ద్వారా, ఇది తెగుళ్లను నియంత్రించడంలో మరింత ఎక్కువ కాలం పనిచేయటంతో పాటుగా ప్రభావాన్ని చూపుతుందని తెలిపింది.

గురక నిద్ర అనారోగ్యానికి దారి తీస్తుంది

- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గురక నిద్ర అనారోగ్యానికి దారి తీస్తుందని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఆదివారం రాష్ట్రంలో మొట్ట మొదటి స్లీప్ థెరపెటిక్స్ కేంద్రాన్ని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురక నిద్ర అనేక అనర్థాలకు కారణమవుతుందని చెప్పారు. దీంతో పాటు నిద్ర రాకపోవడం, నిద్రలో నడవడం, అతిగా నిద్ర పోవడం వంటి సమస్యలకు స్లీప్ థెరపెటిక్స్ కేంద్రం ఎంతో ఉపయోగ పడుతుందని హరీష్ రావు తెలిపారు. గురక నిద్ర, నిద్ర లేమీ సమస్యలు ప్రతి ఒక్కరికీ ఇబ్బంది కలిగిస్తున్నాయని, అలాంటి వారికి స్లీప్ థెరపెటిక్స్ కేంద్రంలో చక్కని పరిష్కారం దొరుకుతుందని వివరించారు. ఈ కేంద్రం వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ హర్శిని ప్రతీక్ వినూత్న ఆలోచనలకు రూప కల్పన చేశారని హరీష్ రావు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, శాసన మండలి చీఫ్ విప్ టి భాను ప్రసాద్ రావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారుపై 'థర్టీ పర్సెంట్ సర్కారు' అస్త్రం

- ఇంటింటికి కాంగ్రెస్ పోస్టర్లు
- ఇదే ప్రధాన అజెండాగా ఎన్నికలకు
- ఆ దిశగా శ్రేణుల సన్నద్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రానున్న ఎన్నికలకు కాంగ్రెస్ బలమైన ప్రచారాస్త్రాలను సిద్ధం చేస్తోంది. కారు వైఫల్యాలపై హస్తం పార్టీ అస్త్రశస్త్రాలను పోగు చేసుకుంటున్నది. ఇప్పటికే అధికార బిఆర్ఎస్ అవినీతిపై ప్రతిపక్ష పార్టీగా అనేక ఆరోపణలు గుప్పిస్తుంది. వాటన్నింటిని వడబోసి ఎన్నికల అస్త్రాన్ని తయారు చేసినట్టు తెలిసింది. బిఆర్ఎస్ 'థర్టీ పర్సెంట్ కమీషన్ల' సర్కారు అంటూ కారుపై కాంగ్రెస్ బాణాన్ని వదలనుంది. ఆ నినాదాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికి పోస్టర్లు వేసి పెద్ద ఎత్తున ప్రచారాన్ని ప్రారంభించనుంది. తద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యాచరణ రూపొందిస్తున్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. కర్నాటకలో బిజెపి సర్కారుపై హస్తం పార్టీ ఇదే రకమైన ప్రచారాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా పేటీఎం తరహాలో 'పే సిఎం' అంటూ, '40 పర్సెంట్ కమీషన్ల' సర్కారు అంటూ గోడపత్రికలు వేసి మరీ ప్రచారం చేసింది. ఈ ప్రచారానికి ఆ పార్టీ అక్కడ దాదాపు 27 శాతం ఓటర్లను ప్రభావితం చేసిందని అప్పట్లో వార్తలొచ్చాయి. అదే తరహాలో రాష్ట్రంలోనూ కారు వేగానికి బ్రేకులు వేసేందుకు 'థర్టీ పర్సెంట్ కమీషన్ సర్కారు' అంటూ విమర్శల బాణం ఎక్కు పెట్టింది. ఆ దిశగా పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా చుక్కనీరు అందడం లేదనీ, కానీ లక్షన్నర కోట్లు ఖర్చు పెట్టిందని ఇప్పటికే కాంగ్రెస్ ఆరోపిస్తుంది. వేల కోట్ల కమీషన్లు బీఆర్ఎస్ పెద్దలకు అందాయని ఆరోపణలు చేస్తోంది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ కాంట్రాక్టులు, ధరణి పోర్టల్, పరిశ్రమలకు భూముల కేటాయింపు,గొర్లకుర్మలకు గొర్ల పంపిణీ, దళితబంధు, బీసీలకు లక్ష సాయం, భూముల అమ్మకాల్లో అవినీతితోపాటు కరెంట్ కొనుగోళ్లల్లో రూ.18 వేల కోట్లు చేతులు మారాయని కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తున్నది. వీటన్నింటిల్లో 30 శాతం కమీషన్లు తీసుకోకుండా ఏ బిల్లును మంజూరు చేయడం లేదనేది బీఆర్ఎస్‌పై హస్తం పార్టీ ఆరోపణ.వీటికి సంబంధించిన స్వల్పకాల నిడివి ఉన్న సందేశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని భావిస్తున్నది. ఆయా జిల్లాల్లో నిర్మాణమవుతున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించి, అక్కడే మీడియాకు చెప్పాలని అధిష్టానం కార్యకర్తలను ఆదేశించింది. సర్కారు అవినీతిపై బహిరంగంగా పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రచారం చేయడం ఒక పద్ధతి కాగా, సెల్‌ఫోన్లు, ఫ్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్‌మీడియాతో క్యాంపెయిన్ చేయాలని నిర్ణయించింది.

డెడ్ స్టోరేజ్‌లో నాగార్జునసాగర్

- 517 అడుగులకు పడిపోయిన నీటి మట్టం
- గతేడాది 530 అడుగులకుపైగా నీరు
- దుక్కులు దున్ని.. నార్లు పోసుకొని రైతుల ఎదురుచూపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎగువ కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురవకపోవడం.. ఎగువ ప్రాజెక్టుల నుంచి ఇన్‌ఫ్లో లేకపోవడంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం డెడ్ స్టోరేజ్‌కి చేరుకుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312 టిఎంసిలు) కాగా.. కనీస నీటిమట్టం 510 అడుగులు. అయితే, ప్రస్తుతం 517 అడుగుల వద్ద 144.0402 టిఎంసిల నీరు ఉంది. ఏడు టిఎంసిల నీరు కేవలం తాగునీటి అవసరాలకే సరిపోవుతుందని అధికారులు చెబుతున్నారు. సాగు నీటి కోసం రైతులు నార్లు పోసుకుని ఎదురు చూస్తున్నారు.

సాగర్ నుంచి ఆయకట్టుకు సాగు నీరు విడుదల చేసే అవకాశాలు ఇప్పట్లో కానరావడం లేదు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో కనీస నీటి మట్టానికి చేరువలో ఉంది. గతేడాది జులై 20న 530 అడుగులకు పైగా నీరు నిల్వ ఉండటంతో సాగునీటికి ఎలాంటి ఢోకా లేదు. గతేడాది జులై 20న శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 55 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం పై నుంచి వరద లేక.. సాగర్ ప్రాజెక్టు 517 అడుగుల వద్ద నీటిమట్టం ఉన్నది. ఇది 144.0402 టిఎంసిల కు సమానం. జలాశయం గరిష్టస్థాయి నీటిమట్టం 510 అడుగులు కాగా, 7అడుగులు తగ్గితే డెడ్ స్టోరేజ్‌కి వెళుంది. ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాల్లేకపోవడంతో కృష్ణానది పరివాహక ప్రాజెక్టులైన ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టులో సైతం నీటిమట్టం పడిపోయింది.

నాగార్జునసాగర్ ఎడమకాలువ రైతులు వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రైతులు నార్లు చల్లుకున్నారు. బోర్లు, బావుల కింద ఉన్న రైతులు ముందస్తుగానే నార్లు పోసుకొని నాటుకు సిద్ధమవుతున్నారు. కాగా ఏ ఆధారం లేని రైతులు సాగర్ కాల్వల నీరు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 23 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీనితోపాటు హైదరాబాద్ జంట నగరాలకు కూడా తాగునీటి అవసరాలు తీర్చుతోంది. ఇందుకు ప్రాజెక్టు కనీసం నీటి మట్టానికి ఏడు టిఎంసిల నీరు మాత్రమే నిల్వ అందుబాటులో ఉంది.



గతేడాది జులై 20న ప్రాజెక్టుకు వరద

గతేడాది భారీ వర్షాల కారణంగా జులై 20వ తేదీన శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 55 వేల క్యూసెక్కుల వరద నీరు నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లోకి వచ్చి చేరింది. అదే నెల 28వ తేదీన ఎడమ కాల్వకు మంత్రి జగదీశ్ రెడ్డి విడుదల చేశారు. ఈ ఏడాది జులై గడుస్తున్నా సరైన వర్షాల్లేక.. నీటి నిల్వలు అడుగంటిపోయాయి. గట్టి వానలు పడి కృష్ణానది ఎగువ ప్రాంతాల నుంచి వరదలు వస్తేనే జలాశయంలో నీటి మట్టం పెరిగే అవకాశం ఉంది. అప్పటిదాకా సాగర్ ఆయకట్టు కాలువలకు నీరు విడుదల చేసే పరిస్థితి లేదు. దీంతో వానాకాలం సాగు ఆలస్యం అవుతున్నది. జులై మొదటి వారంలో యేటా వరి నారు పోసుకొని ఆగస్టులో నాట్లు వేసేవారు. ఈసారి ఆ పరిస్థితి లేదు. మరోవైపు ఇక్కడ వరి సాగు తప్ప మెట్ట పంటలు పండే పరిస్థితి లేదు. రైతులు ఇప్పటికే దుక్కులు దున్ని పొలాలను చదును చేసి పెట్టుకొని వానల కోసం ఎదురుచూస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు ఎడమకాల్వ పరిధిలో మొత్తం 6.50లక్షల ఎకరాలు ఉండగా.. అందులో నల్లగొండ జిల్లాలో 1,45,727 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 1,45,727 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో ఎత్తిపోతలతో కలుపుకుని 2,41,000 వేల ఎకరాలకు నీరు అందించాల్సి ఉంది.

కొనసాగుతున్న స్పిల్‌వే పనులు

ప్రాజెక్టు స్పిల్‌వే దశాబ్దకాలంగా మరమ్మతులకు గురవుతోంది. దీంతో నాలుగు నెలలుగా గుత్తేదారులు చేపడుతున్న పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. జులై చివరి నాటికి స్పిల్ వే పనులను పూర్తి చేస్తామన్న అధికారులు చేయించలేకపోయారు. శుక్రవారం నుంచి ఎనిమిదివ రేడియటల్ క్రస్ట్ గేట్ వద్ద పడిన గుంతలను పూడుస్తున్నారు. కొన్ని క్రస్ట్ గేట్ల వద్ద పెద్ద, పెద్ద గుంతలు అలాగే ఉన్నాయి. చుట్టుపక్కల గ్రామాల్లో కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవ్వడంతో స్పిల్ వే పనులకు కూలీలు దొరక్క కొంత జాప్యం జరుగుతోంది.

ఏటేటా తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఏటేటా పూడిక పేరుకుపోయి రెండు నుంచి మూడు టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోంది. పూడికపై మేధావులు, నిపుణులు హెచ్చరిస్తున్నా పాలకులు కనీసం పట్టించుకోవడం లేదు. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 408 టిఎంసిలు కలిగిన ప్రాజెక్టులో నేడు 300 టిఎంసిల నీటి నిల్వకే పరిమితమైంది.

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం పడిపోతోందని ఇప్పటికే నిపుణులు నిర్ధారించారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉండగానే 2010లో ఏపీ ఇంజినీర్స్ లేబోరేటరీ ఆధ్వర్యంలో సర్వే చేశారు. అప్పట్లో శాటిలైట్ ద్వారా ఈ పరిశీలన చేశారు. ఆ సర్వే రిపోర్ట్ ప్రకారం కేవలం 312 టిఎంసిల నీటిని మాత్రమే నిల్వ చేసుకోగలుగుతున్నట్టు నిర్ధారించారు. సుమారుగా 100 టిఎంసిల వరకూ నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందని ధృవీకరించారు. ఏటా పూడిక వల్ల రెండు నుంచి మూడు టిఎంసిల వరకూ నీటి నిల్వ తగ్గిపోతున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి. రిజర్వాయర్ పరిసరాల్లో కూడా మట్టి పేరుకుపోతున్న తరుణంలో డ్యామ్, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు నష్టం వస్తుందని. తగిన సాంకేతికత ఉపయోగించి పూడిక తగ్గించేందుకు ప్రయత్నించాలని పలువురు నిపుణులు సూచిస్తున్నారు.